
సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



ప్రొసీడింగ్స్ నో

ఎల్ఆర్ఎస్ కింద హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

12లో ▸



హీమోఫిలియాతో జాగ్రత్త

హీమోఫిలియాతో అందరూ జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు.

12లో ▸



రహదారిపై కూలిన చెట్టు

ఈదురుగాలులతో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రిచెట్టు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది.

12లో ▸

నిర్లక్ష్యపు నిప్పు!

ఏటా పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు

- జిల్లాలో గత ఏడాది 1,390 ఘటనలు
- బుగ్గి చేస్తున్న సిగరెట్, బీడీ ముక్కలు
- కారణమవుతున్న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు
- ఆందోళన కలిగిస్తున్న ఆస్తి, ప్రాణనష్టాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అగ్నిమాపక శాఖ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చిన్నపాటి నిర్లక్ష్యం అగ్ని ప్రమాదాలకు దారితీస్తోంది.. విలువైన ఆస్తులే కాదు.. ప్రాణాలను సైతం హరిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు వెలుగు చూసిన అగ్నిప్రమాదాలను పరిశీలిస్తే మెజార్టీ ప్రమాదాలు కాల్చిన సిగరెట్, బీడీ ముక్కలతోనే జరిగినట్లు తేలింది. ఆ తర్వాతి స్థానంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు, మెకానిక్ హీట్స్, గ్యాసు లీకేజీలు ఉన్నాయి. 2014 నుంచి 2025 వరకు 2,657 అగ్ని ప్రమాదాలు వెలుగు చూశాయి. వీటిలో స్మోకింగ్ కారణంగా 968, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా 924, మెకానికల్ హీట్ కారణంగా 172, గ్యాసు లీకేజీ కారణంగా 94 ప్రమదాలు చోటు చేసుకున్నట్లు తేలింది. కొంత మంది అలవాటుగా, మరికొంత మంది ఫ్యాషన్ కోసం సిగరెట్ కాలుస్తున్నారు. స్మోకింగ్ తర్వాత కాలుతున్న ఆయా సిగరెట్/బీడీ ముక్కలను బహిరంగ ప్రదేశాలు, చెత్తకుండీల్లో విసిరేస్తున్నారు. పక్కనే ఉన్న పేపర్లు, ప్లాస్టిక్ కవర్లు, ఎండుగడ్డి, ఇతర పదార్థాలకు అంటుకుని మంటలు వ్యా పిస్తున్నాయి.

మాదాపూర్‌లోనే అత్యధికం

హోటళ్లలో గ్యాస్ లీకేజీ కారణంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండగా, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య సముదాయాల్లో నాసిరకం వైరింగ్, లూజ్ కాంటాక్ట్‌లతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు వెలుగు చూస్తున్నాయి. ఇళ్ల మధ్య వెలసిన ప్లాస్టిక్ గోదాములను కాల్చిపడేసిన సిగరెట్, బీడీ ముక్కలు బుగ్గి చేస్తున్నాయి. పార్కింగ్ ప్రదేశాల్లో మండే రసాయనాలను నిల్వ ఉంచడం ద్వారా గృహ సముదాయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆస్పత్రులు, ఇతర వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేసుకున్నా.. నిర్వహణ లోపంతో తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తునే ఉన్నాయి. విలువైన ఆస్తులతో పాటు ప్రాణాలు పోతున్నాయి. ఏటా ప్రచారం కల్పిస్తున్నా ప్రమాదాలు తగ్గకపోగా, మరింత పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బహుళ అంతస్తుల భవనాలు అధికంగా ఉన్న మాదాపూర్‌లోనే ఎక్కువ ఘటనలు చోటు చేసుకున్నాయి. రాజేంద్రనగర్, హయత్‌నగర్, ఎల్బీనగర్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జిల్లా పరిధిలో తొమ్మిది అగ్నిమాపక కేంద్రాలు పని చేస్తున్నాయి. ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని విపత్తులు, అగ్ని ప్రమాదాల నియంత్రణ శాఖ పలు సూచనలు చేసింది.

గత ఏడాది జిల్లాలో జరిగిన అగ్ని ప్రమాదాలు

ఫైర్‌స్టేషన్	అగ్ని ప్రమాదాలు
మాదాపూర్	316
హయత్‌నగర్	178
రాజేంద్రనగర్	173
ఎల్బీనగర్	161
వట్టినాగులపల్లి	147
చేవెళ్ల	130
ఇబ్రహీంపట్నం	106
షాద్‌నగర్	104
మహేశ్వరం	75



మాదాపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం (ఫైల్)

హోటల్స్‌లో పాటించాల్సినవి

- పై అంతస్తుల్లోని డోర్లు, మెట్లకు ఎలాంటి వస్తువులు అడ్డుపెట్టరాదు.
- ప్రధాన ద్వారాలకు ఎదురుగా అగ్నిమాపక పరికరాల స్థానం తెలిపే 'ఎస్కేప్ ప్లాన్' ఉంచాలి.
- ఎయిర్ కండిషన్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా 'డ్యాంపర్స్'ను ఏర్పాటు చేసి, ఆటోమెటిక్ డిటెక్షన్ సిస్టంకు అనుసంధానించాలి.
- విద్యుత్ వైరింగ్, ఉపకరణాలు, స్విచ్‌లను క్రమం తప్పకుండా చెక్ చేసుకోవడంతో పాటు లోపాలను సరిదిద్దుకోవాలి.
- తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి, అత్యవసర సమయాల్లో ఏ విధంగా అనుసరించాలో వివరించాలి.
- వంట గదుల్లోని ఎల్‌పీజీ సిలిండర్ నిల్వ చేసే ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- బేస్‌మెంట్‌ను కేవలం పార్కింగ్ కోసమే వాడాలి. మండే పదార్థాలు, ఆయిల్స్ నిల్వ చేయరాదు.

షార్ట్‌సర్క్యూట్‌లు జరగకుండా..

- బీఎస్ఐ స్టాండర్డ్ ఎలక్ట్రిక్ ఉపకరణాలు మాత్రమే వాడాలి.
- క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్‌తోనే పనులు చేయించాలి.
- వైరింగ్‌లో జాయింట్స్, లూజు కాంటాక్ట్‌లు లేకుండా చూసుకోవాలి. ప్లగ్ లేని వైర్ చివరను సాకెట్‌లో ఉంచాలి.
- రిఫ్రిజిరేటర్, ఓవెన్‌లను ధారాళమైన గాలి, వెలుతురు వచ్చే ప్రదేశాల్లోనే ఉంచాలి. కిచెన్‌లో ఉంచరాదు.
- కార్పెట్లు, చాపల కింద ఎలక్ట్రిక్ వైర్లు లాగొద్దు. వాటిని తొక్కడం ద్వారా షార్ట్‌సర్క్యూట్ సమస్య తలెత్తే అవకాశం ఉంది.
- విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల నివారణ కోసం సరైన ఎర్తింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి.
- సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను బెడ్ వద్ద చార్జింగ్ పెట్టరాదు.
- విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే వాటిని నీటితో ఆర్పే ప్రయత్నం చేయొద్దు. స్విచ్ఛాఫ్ చేయడం, పొడి ఇసుక, కార్బన్‌డై ఆక్సైడ్‌తో మంటను ఆర్పేయాలి.
- విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తికి అధిక మోతాదులో నీళ్లు ఇవ్వాలి. స్విచ్‌రూమ్‌లో చెత్త వేయకూడదు.

ఆస్పత్రుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఫ్లోర్లను ఫైర్ కంపార్టుమెంట్స్‌గా విభజించి, అగ్ని ప్రమాదాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- అత్యవసర ద్వారాలు, ఫైర్ డోర్లకు లాక్ చేయకూడదు.
- బయటికి వెళ్లే మార్గాల 'ఎవాక్యూయేషన్ ప్లాన్'ను ప్రతి అంతస్తులో అందరికీ కన్పించేలా ఏర్పాటు చేయాలి.
- ప్రతి ఐదేళ్లకోసారి విద్యుత్ వైరింగ్, ఎంసీబీలు, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్‌తో పరీక్ష చేయించుకోవాలి.
- అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు లిఫ్టులు వాడొద్దు.
- అత్యవసర ద్వారాల సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలి.
- బ్యాటరీ బ్యాకప్‌తో కనిసం 20 నిమిషాలు పని చేసేలా ఎమర్జెన్సీ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి.
- ఫైర్ అలారం మోగిన వెంటనే భవనం ఖాళీ చేయాలి. అగ్ని ప్రమాదాలపై 101కు సమాచారం ఇవ్వాలి.

న్యూస్‌రీల్

నెలాఖరులోగా టెన్త్ ఫలితాలు

ముగిసిన పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. మార్కుల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ మొదలు పెట్టారు. నెలాఖరులోగా ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ స్పష్టం చేసింది. జవాబు పత్రాల మూల్యాంకనంలో 1,100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే సుమారు రెండు లక్షల జవాబు పత్రాలను దిద్ది రికార్డు సృష్టించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం ఇవ్వలేదని ఆ శాఖ ప్రకటించింది. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల మార్కుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. శనివారం నుంచి ఆయా పాఠశాలలు విద్యార్థులకు సెలవులు ప్రకటించాయి. అయితే ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు మాత్రం ఈ నెల 24 వరకు హాజరు కానున్నారు.

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు పదోన్నతి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎస్. బాలకృష్ణకు పదోన్నతి లభించింది. రాష్ట్రంలోని పలువురు కమిషనర్లను గ్రేడ్–2 ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు సైతం ప్రమోషన్ దక్కింది. పదోన్నతి రావడంతో గ్రూప్–1 అధికారి హోదాకి చేరుకోవడం జరిగిందని.. ఈ హోదా తన బాధ్యతను మరింత పెంచిందని బాలకృష్ణ తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



ఓ ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఆమనగల్లు: ఎరువుల డీలర్లు, ఫర్టిలైజర్ షాపుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి బి.నర్సింహారావు అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్ బుక్స్, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయా మండలాలకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ముందుగా తెచ్చుకోవాలని, సీజన్ ప్రారంభం నాటికి విక్రయానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. స్టాక్ రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పక్కాగా జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య

యాచారం: ఈజీఎస్ సామాజిక తనిఖీల కార్యక్రమం పక్కాగా జరగాలని జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏడాది పాటు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి తనిఖీల సిబ్బందికి రికార్డులు అందజేయాలని సూచించారు. కూలీలతో కలిసి పనులు చూపించాలని, పనుల్లో అవకతవకలు, అక్రమాలు జరిగితే బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈజీఎస్ అధికారులు రికార్డులు అందజేస్తే త్వరలో తనిఖీల సిబ్బంది గ్రామాలకు వచ్చి గ్రామ సభలు నిర్వహిస్తారని తెలిపారు. సర్వే పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

'భూ భారతి'తో సమస్యలకు చెక్

కలెక్టర్ నారాయణరెడ్డి

షాద్‌నగర్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి చట్టంలో హక్కుల రికార్డు సవరణ కోసం అవకాశం లేదని, తప్పుల సవరణ కోసం కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని తెలిపారు. కొత్త భూ భారతి చట్టంలో హక్కుల రికార్డుల తప్పుల సవరణకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందన్నారు. నూతన చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధార్ తరహాలోనే భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్ర వివరాలతో భూధార్ కార్డును జారీ చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త చట్టంలోని అంశాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీత, తహసీల్దార్ పార్థసారథి, ఏడీఏ రాజరత్నం, ఏఓ నిషాంత్‌కుమార్, ఎంపీడీఓ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో అవగాహన సమావేశం

కేశంపేట: భూ భారతి చట్టంపై రైతులు, ప్రజలకు గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో షాద్‌నగర్ ఆర్డీఓ సరిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. కలెక్టర్ నారాయణరెడ్డి నూతన చట్టం గురించి వివరించారు. అనంతరం చట్టంపై పలువురి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజరత్నం, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, వీరేష్, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట
- నచ్చచెప్పి లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసా భాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీసింది. మండల పరిషత్ సమావేశ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ నెరవేర్చాలని, అప్పటి వరకు లబ్ధిదారులు బాకీగానే భావించాలని అన్నారు. అంతలోనే కేసీఆర్ హయాంలో దళితులకు ఇస్తామని చెప్పిన మూడెకరాల భూమి ఎందుకివ్వలేదని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ క్రమంలో తోపులాట, గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యే సబితారెడ్డి జోక్యం చేసుకుని అందరినీ శాంతింపజేసి బయటికి పంపించారు. అనంతరం చెక్కుల పంపిణీ పూర్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, ఎంపీడీఓ సరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరెక్టర్లు పి.పాండు, యుగంధర్‌గౌడ్, సురేందర్, ఆనంద్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య కొనసాగుతున్న వాగ్వాదం



ఆకుతోటపల్లిలో డప్పులు కొడుతున్న కసిరెడ్డి, వెన్నెల తదితరులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల

ఆమనగల్లు: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఆకుతోటపల్లిలో గురువారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ అభియాన్‌లో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ జీవీ వెన్నెల, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వానికి బుదిద చెప్పడానికి ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ జీవీ వెన్నెల మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణమాఫీ పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, మాజీ ఎంపీపీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన విద్యుత్ తీగలు

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆరోపణ
- సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా



అశోక్ రెడ్డి (ఫైల్)

కొందుర్గు: విద్యుత్ తీగలు ఓ యువకుడి పాలిట యమపాశాలయ్యాయి. పొలంలో తెగిపడిన తీగలు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నఎల్కిచర్ల శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండలం మొదళ్లగూడ గ్రామానికి చెందిన చింతకుంట లక్ష్మమ్మ, రవీందర్ రెడ్డి దంపతులు వ్యవసాయంతోపాటు ఆవుల వ్యాపారం నిర్వహిస్తారు. 15 ఏళ్ల క్రితం కొందుర్గు మండలం పర్వతాపూర్ గ్రామానికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. చిన్నఎల్కిచర్ల శివారులో అఖిల్ రెడ్డి అనే వ్యక్తి పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం గాలివానకు పొలం పక్కనే ఓ విద్యుత్ స్తంభం విరిగి తీగలు తెగిపడ్డాయి. గురువారం రవీందర్ రెడ్డి కుమారుడు అశోక్ రెడ్డి (35) పొరపాటున అటు వైపు వెళ్లడంతో తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య అక్షయ, ఇద్దరు కుమారులు ఉన్నారు.



చిన్నఎల్కిచర్ల సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన..

మూడు రోజుల క్రితం స్తంభం విరిగిపోయి తీగలు తెగిపడినా మరమ్మతులు చేయకపోవడంతోనే నిండు ప్రాణం పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి అశోక్ రెడ్డి మృతదేహాన్ని చిన్నఎల్కిచర్ల సబ్‌స్టేషన్ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. అధికారుల నిర్లక్ష్యం తోనే అశోక్ రెడ్డి ప్రాణాలు కోల్పోయాడని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు మృతుడి భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలస్వామి, షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఏసీపీ రంగస్వామి అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులను సముదాయించినా ఫలితం దక్కలేదు.

సాయం ప్రకటనతో ఆందోళన విరమణ

గాలివానకు చాలా గ్రామాల్లో కరెంటు స్తంభాలు విరిగిపోయాయని అన్నీ సరిచేసుకుంటూ వస్తున్నామని ఏఈ రవికుమార్ తెలిపారు. తీగలు తెగిన చోట సరఫరా నిలిపివేశామని, తీగలపై చెట్లు విరిగిపడటంతో ఎక్కడో మరో లైన్ తీగలు తగిలి ఉంటాయని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి రూ.5లక్షల వరకు ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, స్వతహాగా తాము మరో రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించండి

తుక్కుగూడ: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే చిన్నారులకు ప్రభుత్వాలు పంపిణీ చేసే పౌష్టికాహారం అందించాలని కేంద్ర మహిళ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీలు డాక్టర్ ప్రీతం, యశ్వంత్ అన్నారు. పురపాలక కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల వ్యక్తిగత వివరాలు, అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆట పాటలతో చిత్రాలను ఉపయోగించి చిన్నారులకు బోధన చేయాలని, పిల్లల మేధో వికాసం పెంపొందించే విధంగా బోధన ఉండాలన్నారు. వారి మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, సీడీపీఓలు శాంతిశ్రీ, షబానా పాల్గొన్నారు.



తుక్కుగూడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యువత సృజనాత్మకతను అందిపుచ్చుకోవాలి

షాద్‌నగర్: యువత ఆధునిక పరిజ్ఞానంతో సృజనాత్మకతను అందిపుచ్చుకోవాలని రీసోర్స్‌పర్సన్ డాక్టర్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఐఐసీ సెల్ సంయుక్త సహకారంతో గురువారం ప్రోటోటైప్, ప్రాసెస్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేపట్టి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, ఉద్యోగాలను సృష్టించడం, ఆర్థికవృద్ధిని సాధించడంకోసం ఇలాంటి వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. యువత ఉద్యోగాలను సాధించడం కాదు ఉద్యోగాలను ఇచ్చే స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. వర్క్‌షాపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె, వైస్ ప్రిన్సిపాల్ సృజన, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ శ్రీలత, శ్రీలక్ష్మి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆఫీసర్ సంతోష, ఐఐసీ సెల్ హెడ్ స్పందన తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులతో శరత్‌చంద్రారెడ్డి తదితరులు

గస్తీ ముమ్మరం



పట్టుబడ్డ మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న డీసీపీ తదితరులు

పహాడీషరీఫ్: పక్షం రోజులుగా పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాలలో నేరాలు పెచ్చుమీరుతుండడంతో రాచకొండ కమిషనరేట్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉమర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 200 మంది పోలీసులు గ్రూప్‌లుగా ఏర్పడి కాలనీకి వచ్చి, పోయే మార్గాలను మూసి సోదాలు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 70 బైక్‌లు, ఏడు ఆటోలతో పాటు 39 లీటర్ల అక్రమ మద్యం స్వా.

పహాడీషరీఫ్‌లో కార్డన్ సెర్చ్

- పర్యవేక్షించిన డీసీపీ సునీతారెడ్డి



బస్తీలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న డీసీపీ సునీతారెడ్డి

దీనం చేసుకున్నారు. ఐదు మంది రౌడీషీటర్లు, ముగ్గురు సస్పెక్ట్ షీటర్లను అదుపులోకి తీసుకొని నేరాలకు పాల్పడొద్దని డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలతో మమేకమైన ఆమె ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అభయమిచ్చారు. ఈ సోదాలలో అదనపు డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోక్సో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగారం

రూ.30 వేల జరిమానా



నరేందర్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమపేరుతో బాలికను మోసం చేసి, వివాహం చేసుకోవడంతో పాటు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిందని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎంపీ పటేల్‌గూడకు చెందిన జంగం నరేందర్ (20) మేస్త్రీ పని చేస్తుండేవాడు. ఇదే గ్రామంలోని ఓ ఇంట్లో పనులు చేస్తుండగా.. బాలిక పరిచయమైంది. ప్రేమ పేరుతో ఆమెను అపహరించి, పెళ్లి చేసుకోవడంతో పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై 2018లో ఆదిబట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోక్సో చట్టం ప్రకారం నరేందర్‌ను దోషిగా నిర్ధారిస్తూ ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నరేందర్‌కు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బాధితురాలికి రూ.40 లక్షల పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సునీత, రఘు వాదనలు వినిపించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

బీజేపీ పరువునష్టం కేసు వాయిదా

- గైర్హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- విచారణను ఈనెల 24కు వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో న్యాయస్థానం విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. ఈ కేసు విచారణకు ఫిర్యాదుదారుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కూడా గైర్హాజరయ్యారు. ప్రతివాది అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యకలాపాల నేపథ్యంలో కోర్టుకు రాలేకపోయారని ఆయన తరుపు న్యాయవాదులు విశ్వేశ్వర్‌రావు కోర్టుకు సూచిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

టీచర్ పర్స్ పోయిందని..


విద్యార్థిని పరీక్ష రాయనీయని వైనం



ప్రిన్సిపాల్ గదిలో కూర్చుని పరీక్ష రాస్తున్న విద్యార్థి

కొందుర్గు: పాఠశాలలో ఉపాధ్యాయురాలి పర్స్ పోయిందనే నెపంతో.. ఓ విద్యార్థిని వార్షిక పరీక్ష రాయకుండా అడ్డుకున్నారు. ఈ ఘటన కొందుర్గు గురుకుల పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. పాఠశాలలో గ్రంథాలయ బాధ్యతలు చూసుకునే ఉపాధ్యాయురాలు స్వాతి పర్స్ మిస్ అయ్యింది. అందులో ట్యాబ్‌లెట్లతో పాటు ఏటీఎం కార్డు, రూ.100 ఉన్నాయని స్వాతి తెలిపారు. అయితే ఈ పర్స్‌ను 9వ తరగతికి చెందిన ఓ విద్యార్థి తీసుకున్నాడనే అనుమానంతో గురువారం ఉదయం జరిగిన వార్షిక పరీక్షను క్లాస్ టీచర్ రాయనీయలేదు. అంతేకాకుండా పర్స్ తీసుకొచ్చాక పరీక్ష రాయాలని ఆదేశించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ప్రిన్సిపల్ కుర్షీద్ సదరు విద్యార్థిని తన ఎదుట కూర్చోబెట్టుకుని పరీక్ష రాయించారు. టీచర్ పర్స్ మాత్రం ఎక్కడా దొరకకపోవడం గమనార్హం.

hmda
Growing Global



ఎల్‌ఆర్‌ఎస్.. ప్రొసీడింగ్స్ నో

అనుమతుల కోసం ఎదురుచూపులు

55 వేల మందికి పైగా ఫీజు చెల్లింపు

- నెల దాటినా ప్రొసీడింగ్స్ అందకపోవడంపై ఆందోళన
- హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల దరఖాస్తులు

➡ రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రానికి చెందిన పర్వతాలు తన 248 చదరపు గజాల స్థలానికి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 14 శాతం ఓపెన్‌స్పేస్ ఫీజుతో పాటు రెగ్యులరైజేషన్ చార్జీలతో కలిపి (25 శాతం తగ్గింపుతో) రూ.24,462 చెల్లించారు. ప్రస్తుతం నెల రోజులు దాటింది. కానీ.. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ నుంచి ప్రొసీడింగ్స్ లభించలేదు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించినట్లు నిర్ధారణ పత్రం ఉన్నప్పటికీ నెలరోజులు దాటినా అనుమతి పత్రాలు లభించకపోవడంతో ఆయన ఆందోళనకు గురవుతున్నారు.

➡ శామీర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఒక లేఅవుట్‌లో 40 మంది స్థల యజమానులు తమ ప్లాట్‌ల క్రమబద్ధీకరణ కోసం సుమారు రూ.40 లక్షలు ఫీజులు చెల్లించారు. నెలరోజులు దాటినా ప్రొసీడింగ్స్ లభించకపోవడంతో హెచ్‌ఎండీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

➡ మహేశ్వరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన 500 చదరపు గజాల స్థలం కోసం నిబంధనల మేరకు ఫీజులు చెల్లించారు. ప్రొసీడింగ్స్ రాకపోవడంతో హెచ్‌ఎండీఏకు పరుగెత్తుకొచ్చారు. రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకోవాలంటూ సెలవిచ్చారు. తన స్థలం చెరువులు, కుంటలకు దూరంగా ఉందని, అలాంటప్పుడు తాను ఎందుకు రెవెన్యూ ఎన్‌ఓసీ సమర్పించాలని ఆయన ప్రశ్నించారు. ఇలా ఒక్కరో ఇద్దరో కాదు నిత్యం పదుల సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ బాధితులు హెచ్‌ఎండీఏ అధికారులను సంప్రదిస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

ఎల్‌ఆర్‌ఎస్– 2020 పథకంలో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 55వేల మందికి పైగా ఫీజులు చెల్లించారు. మొత్తం దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకుంటే హెచ్‌ఎండీఏకు ఫీజుల రూపంలో సుమారు రూ.1500 కోట్ల వరకు లభించే అవకాశం ఉన్నట్లు అంచనా. కానీ.. ఇప్పటి వరకు చెల్లించిన ఫీజులపై సుమారు రూ.155 కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభించింది. రకరకాల సమస్యల కారణంగా లక్షల కొద్దీ దరఖాస్తులు పెండింగ్ జాబితాలో పడిపోయాయి. ప్రభుత్వం 25 శాతం ఫీజు తగ్గింపు సదుపాయంతో ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినప్పటికీ సాంకేతిక సమస్యల దృష్ట్యా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు వెనకడుగు వేస్తున్నారు.

మరోవైపు నిబంధనల మేరకు ఫీజులు చెల్లించినవారికి మాత్రం సకాలంలో ప్రొసీడింగ్స్ అందడం లేదు. కేవలం 10 రోజుల్లోనే ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. కాగా.. నెల రోజులు దాటినా లభించకపోవడం గమనార్హం. ఇలా ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో పడిన వాళ్లంతా హెచ్‌ఎండీఏలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ సహాయ కేంద్రానికి వచ్చి మరోసారి తమ వివరాలను అందజేయాల్సివస్తోంది. 'నలభై ప్లాట్‌లకు ఒకేసారి ఫీజులు చెల్లించాం. నెలరోజులు దాటినా ఎలాంటి స్పందన లేదు. సమాధానం చెప్పే అధికారులు కూడా అందుబాటులో లేకుండా పోయారు' అని శామీర్‌పేట్‌కు చెందిన బాధితుడు ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు.

దిద్దు'పాట్లు'..

మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రక్రియలో తలెత్తే లోపాలను సరిదిద్దడం కూడా సవాల్‌గా మారింది. ఒకేప్రాంతానికి చెందిన స్థలాలపై రకరకాల ఫీజులు నమోదవుతున్నాయి. 250 చదరపు గజాలు ఉన్న స్థలానికి కొందరికి రూ.18 వేల వరకు ఫీజు నోటీసులు అందితే.. మరికొందరికి రూ.1.14 లక్షల వరకు నోటీసులు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు తప్పుగా నమోదవుతున్నాయి. ఇలాంటి తప్పులను సరిదిద్దేందుకు సైతం దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరగాల్సివస్తోంది. కొన్ని మున్సిపల్ కార్యాలయాల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా నియమించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కరెక్షన్స్ పేరిట డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు దళారులు సైతం యథావిధిగా తమ దందాను కొనసాగిస్తుండటం గమనార్హం.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటయ్య (ఫైల్)

చేవెళ్ల: సొంతూరుకు వెళ్తానని బయలుదేరిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం మక్తగూడ గ్రామానికి చెందిన బుత్తుల వెంకటయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి కొంత కాలంగా చేవెళ్లలో నివాసముంటున్నాడు. కాగా ఈ నెల 15న ఉదయం 8 గంటల సమయంలో సొంతూరు మక్తగూడకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. తరువాత అతని భార్య శ్రీలత ఫోన్ చేస్తే అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మక్తగూడకు వెళ్లి ఉండవచ్చని భావించి బుధవారం రాత్రి శ్రీలత తన అత్తకు ఫోన్ చేసింది. ఆయన అక్కడికి వెళ్లలేదని తెలిసి గురువారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్: ఇంట్లోనే ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరొళ్ల వెంకటస్వామికి పదేళ్ల క్రితం మొదటి భార్య మరణించడంతో జయమ్మ(40)ని రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు ముగ్గురు కొడుకులు, రెండో భార్యకు ఒక కూతురు. మొదటి భార్య పెద్ద కొడుకు ఆరు నెలల క్రితం మృతి చెందాడు. కాగా గురువారం వెంకటస్వామి పనికి వెళ్లగా జయమ్మ ఇంటి వద్దనే ఉంది. తనతోపాటు ఉన్న కూతురిని బయటకు పంపించి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇక్ఫాయ్‌లో ముగిసిన మేధో సమ్మేళనం



హాజరైన అతిథులు

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన 'ఇక్ఫాయ్ కాన్ఫరెన్స్ ఆఫ్ నేషన్స్ (ఐకాన్)-2025' కార్యక్రమం గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా చివరి రోజు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ కార్యనిర్వాహక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రోజుల మేధో సమ్మేళనంలో ముఖ్యంగా అంతర్జాతీయ సహకారం, న్యాయ పరిజ్ఞానం, మానవీయ సిద్ధాంతాలు, మేధో వినిమయం, కుటుంబ త్యాగాలు, శాంతి, రాజీ, పరస్పర గౌరవం, అంతర్జాతీయ సంబంధాల వంటి వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా జస్టిస్ ప్రకాశ్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికీ న్యాయం వైపే ఉండాలని, భారత రాజ్యాంగం పట్ల విధేయతతో ఉండాలని, మానవ విలువలని నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. ఇక్ఫాయ్ వైస్ చాన్సలర్ ఎల్ఎస్ గణేశ్, లా స్కూల్ డైరెక్టర్ ప్రొ. రవిశేఖరరాజు మాట్లాడుతూ.. ఇలాంటి వేదికలు విద్యార్థులు జీవితంలో ఎదగడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రీసెర్చ్ డీన్ ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ డీన్ డా.అరుణ్, ఐకాన్ 2025 కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

చేవెళ్ల ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన చిలుకూరు గ్రామస్తులు



చేవెళ్ల ఆర్డీఓకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న చిలుకూరు గ్రామస్తులు

మొయినాబాద్: అక్రమంగా కబ్జాలకు గురవుతున్న విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని చిలుకూరు గ్రామస్తులు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు ఫిర్యాదు చేశారు. గురువారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో సర్వేనంబర్ 164, 166లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాటిని తొలగించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. మరోవైపు మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు సైతం ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, దేవకుమార్, పద్మారావు, ప్రశాంత్, నవీన్, జయవర్ధన్, కిరణ్, రాజు, వెంకటేష్, సునీల్, సుధాకర్, ప్రసాద్, గోపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు పంపిణీ చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు పడుతాయని చెప్పారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కమిటీ సూచించిన జాబితా ప్రకారం ఇళ్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 3700ల ఇళ్లు మంజూరయ్యాయని, ఒక్కో మండలానికి 700లకు పైగా ఇళ్లు అందుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, ఆర్డీఓ చంద్రకళ, ఐదు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కూలిన చెట్టు

భారీగా ట్రాఫిక్ జాం



మర్రిచెట్టు కూలడంతో రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

చేవెళ్ల: ఈదురుగాలులతో కూడిన వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మర్రిచెట్టు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచడంతో మండలంలోని మీర్జాపూర్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్ద మర్రిచెట్టు కూలింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ఇరువైపులా కిలోమీటర్‌కుపైగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి జేసీబీ సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

హీమోఫిలియాతో జాగ్రత్త

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



హుడాకాంప్లెక్స్: అవగాహన ర్యాలీ

హుడాకాంప్లెక్స్: రక్తం సరిగ్గా గడ్డకట్టకపోవడాన్ని హీమోఫిలియా అంటారని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సరూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం హీమోఫిలియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాయాలు అయినప్పుడు రక్తం గడ్డకట్టకపోవడంతో అధిక రక్తస్రావం జరుగుతుందని, ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుందని అన్నారు. ఇది అరుదైన జన్యు రక్త రుగ్మత అని తెలిపారు. మృదు కణజాలంలో గాయాలు అయినప్పుడు కీళ్లు, మోకాళ్లు, మోచేతుల్లో రక్తస్రావం జరిగి నొప్పి, వాపులు వస్తుంటాయని, గాయాలు కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డా.గీత, మెడికల్ ఆఫీసర్ అర్చన, డా.వినోద్ పాల్గొన్నారు.

వ్యాధి నిర్మూలనకు కృషి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ హీమోఫిలియా నిర్మూలనకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. గురువారం ప్రపంచ హీమోఫిలియా దినోత్సవాన్ని పురస్కరించుకొని చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... హీమోఫిలియా అనేది వంశపారపర్యంగా వస్తుందని, ఇది రక్తం గడ్డకట్టే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు జగదీష్, సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రకళ, శ్రీరామ, అమృత, ల్యాబ్ టెక్నీషియన్ శివ పాల్గొన్నారు. పట్టణ సమీపంలో గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ నీతాపోలే ఆధ్వర్యంలో ప్రపంచ హెమోఫిలియా దినోత్సవాన్ని నిర్వహించారు.